# సుందరి * దీపావళిచీర అను ధ్వని ప్రయోగంకథ

"అయ్యయ్యో!" అంది సుందరి గది ఊడుస్తూ. ఊడుస్తూన్నదల్లా మధ్యలోనే ఆపేసి యోగారావు ఎదుటి కొచ్చి నిలబడింది.

ఫైలు రాసుకుంటూన్న యోగారావు తలెత్తి, భ్రుకుటి ముడిచి, 'ఏంటి?' అన్నట్టు చూసి మళ్ళీ తన రాతలో మునిగిపోయాడు. అతని చొక్కా అంచుని పట్టిచూస్తూ, "చూసారా మీ బట్టలన్నీ పాతబడిపోయాయ్, ప్చ్!" అంది సుందరి.

యోగారావు తలెత్తి చూసి "ఊఁ" అని తలదించేసుకున్నాడు.

"పండగొచ్చినప్పుడైనా ఒక జత అమర్చుకోకపోతే కొత్తవి ఎట్లా అమరుతాయి చెప్పండి!"

"ఊఁ?" చూసిచూసి సుందరి అతని వెనక వైపు నించి కుర్చీ మీదకు గోముగా, "దీపావళొస్తోందండీ!" అంది, "ఊఁ!"..."అన్నింటికీ ఊఁ,ఊఁ,ఊఁ... ఏం చేసుకోను ఈఊఊఊఎఎల్ని! నా ఖర్మ!' -సుందరి గొంతులో కొంచెంగా జీర అలుముకుంది. రెండు క్షణాలాగి మళ్ళీ అంది సుందరి! "చుట్టుపక్కల ఎవర్ని చూసినా కొత్తబట్టలు కట్టుకొని అంతా రతీమన్మథుల్లాగా కిలకిల్లాడుతూ జంటలు జంటలుగా గుళ్ళోకి సినిమాలకీ వెడుతుంటారు. ఏదొచ్చినా "హుఁ". యోగారావు చటుక్కున తలెత్తి చూసాడు అన్నాడు : "ఏదొస్తోంది? ఎవరూ వచ్చేది?' సుందరి నిశితంగా చూసింది. "ఓహో, ఏదో వస్తోందంటే గాని మీకు నామాటలు వినిపించవన్నమాట... నేను! నేనే వచ్చేది!.. అరగంటలో బట్టలు మార్చుకొస్తాను. మీరు కూడా రెడీ అవుతారా సరేసరి లేకపోతే మర్యాదక్కదు!" అంది. "నా ఖర్మ! అన్నింటికీ నేనే ప్రేరేపించాలీ మనిషిని!" అనుకుంటూ లోపలి కెళ్ళిపోయింది.

★ ★ ★

బట్టలకొట్టు దగ్గర సుందరి హఠాత్తుగా ఆగిపోయి, "రండి" అంటూ భర్తని లోపలికి తీసికెళ్ళింది. సుందరి లోపలికి వెడుతూంటే యోగారావు నెమ్మదిగా పరధ్యానంగా వెనక్కొచ్చి బయట స్టూలుమీద దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. తను రాస్తూ రాస్తూ ఆపేసిన ఫైలు ఎట్లా కొనసాగించాలా అని ఆలోచిస్తున్న యోగారావుకి, కాస్సేపటికి లోపల చీరెల గుట్టల్లో సుందరి మునిగి పోయుండటం కనిపించింది. మధ్యమధ్య ఆమె, బయట కూర్చునున్న తనని కొట్టుకుర్రాడికి చూపిస్తున్నట్టు గమనించాడు యోగారావు.

కాస్సేపటికి ఏదో చీరెతో బయటి కొచ్చింది సుందరి, భర్తతో "నేనొచ్చే వరకూ కదలకండి. ఇప్పుడే వస్తానూ!" అంటూ రోడ్డు దాటి అవతలకి వెళ్ళిపోయింది.

కొట్టు కుర్రాడొచ్చి యోగారావు పక్కన నుంచున్నాడు. అరగంట గడిచింది. సుందరి జాడలేదు. యోగారావుకు క్రమంగా తెలివొచ్చింది! 'సుందరి తనని ఇక్కడ ఉండమందేంటి చీరె తీసికెడుతూ తనని డబ్బే అడగలేదు పైగా ఈ కుర్రాడొచ్చి పక్కన నుంచున్నాడు. అంటే, తనని హామీ పెట్టి చీరె తీసికెళ్ళిందా? అంటే అది పరాచికమన్నమాట!'. ఇదేం పరాచకం గుడ్ గాడ్! తనని, తనంతటి మగాణ్ణి, ఇట్లా నడిబజార్లో నిలబెట్టి నిలూనా అమ్మేస్తుందా! ఈవిడకింత పొగరా!.. అసలు తను చీరె కొనటాని

కొనిపెట్టు తనతో మాట మాత్రంగానైనా చెప్పలేదు. అసలూ.. ఇందాకన తను " దీపావళోస్తోందండీ" అని అప్పట్లు లీలగా గుర్తుకొస్తోంది. అంటే "నాకు చీరె కావాలి సుమా!" అని ధ్వనించినట్టుకాదూ, ఆహా! ఏం తెలివిగా చెప్పిందండీ! అప్పుడే తను తెలివితెచ్చుకొని, "మరీ! కానీ చూసావ్, ఈ దీపావళి మనకి శివరాత్రి అమ్మడూ!" లాంటి డైలాగేదో పారేసుంటే ఆ ధ్వనికి ఈ ధ్వని సరిపోయి అమె నోరు మూతబడేది. ఇంతకీ, " నేనొచ్చే దాకా కదలకండి" అని ఆమె అనటంలో, "నిన్ను తాకట్టు పెట్టాను తల్పు కట్టి బయటకి రావోయ్ చూద్దాం మగాడా" అని ధ్వని ఏమో!

అసలామె ఇంటికెళ్లి పోయిందేమో మైగాడ్! ... ఎంతపని చేసిందీ ఆడకూతురు! తనోక మహాపోటుగత్తెనుకొంటోందిరాస్కెల్! ఆమాటలు ధ్వని ఈ ధ్వని. ఆగాగు, సమయం రాకపోదు... ఇంతకీ ఇప్పుడేం చెయ్యాలి? జేబులో డబ్బు వేసుకుని రాలేదుతను. ఎట్లాగ? ఇట్లాఅనుకుంటూ అప్రయత్నంగా జేబులోకి చెయ్యి పోనిచ్చాడు యోగారావు వంద నోట్లు తగిలాయి. తెల్లబోయాడు. కానీ వెంటనే తెలివితెచ్చుకొని పక్కన నుంచున్న కొట్టు కుర్రాణ్ణి అడిగాడు! "ఆవిడ తీసి కెళ్ళిన చీరె ఖరీదెంత?" అని.

" రెండొందల్నార్" అన్నాడు వాడు. యోగారావు సర్రున లేచాడు. అందకు అరగంటక్రితం నించీ ఫోన్‌లో అదేపనిగా మాట్లాడేస్తున్న షావుకారు దగ్గర కెళ్లాడు. జేబులోంచి రెండు నోట్లే తీసి అతని ముందుకు విసిరాడు. మాట్లాడకుండా ఆషావుకారు వాటిని గల్లా పెట్టెలోకి తోసేసుకున్నాడు.

★ ★ ★

కోపంతో కరకరలాడుతూ బజార్లోకి నడిచాడు యోగారావు, పదడుగులేసాడో లేదో ఇంకోషాపులో బట్టలు బేరం చేస్తూ కనబడింది సుందరి. రెండు క్షణాలాలోచించి ఆ షాపులోకి నడిచాడు యోగారావు. భర్తని చూస్తూనే అంద సుందరి ," అరె వచ్చేసారా , రండి!"

నాలుగైదు నిముషాల్లో యోగారావు కంటికి నదురుగా కనబడ్డ బట్టలు- తన పాంటూ షర్టుకి చింపించాడు. సుందరి తన చేతిలోని చుక్కల గుడ్డ భర్తకి చూపించి " జాకెట్టుకు ఇది బాగుంటుం దండి?" అనడిగింది. యెగారావు మాట్లాడలేదు. . చూసి చూసి సుందరి చివరికి కొట్టు కుర్రాడితో "జాకెట్ ముక్క నువ్వే ఏరివ్వవయ్యా!" అంది. వాడు ఏరటం మొదలు పెట్టాడు. ఈ లోపల యోగారావు తన బట్టల్ని షావుకారు దగ్గరికి తీసికెళ్లి బిల్లు రాయించాడు. " ఇదీ అదీ కలిపి ఆవిడిస్తుందిలెండి" అన్నాడు. సుందరివైపు తిరిగి, " నేనొచ్చేదాకా ఇక్కడేవుండవోయ్, కదలకు!" అన్నాడు. సుందరి కంగారుగా " అగండి, ఎక్కడికి, మిమ్మల్నే!" అంటూ ఇవతల కొచ్చింది అప్పటికే యోగారావు తన పాకెట్టుతో కొట్టు దిగి జనంలో కలిసిపోయాడు.

★ ★ ★

రాత్రి ఎనిమిదవుతూండగా సుందరి ఇంటి కొచ్చింది చీరపాకెట్టుతో. "హల్లో వచ్చేసావా!" అన్నాడు రాసుకుంటూన్న యోగారావు. " ఆహా . . అవునూ, మీ బట్టల పాకెట్టు ఇక్కడే ఉందేమిటి! టైలరు కివ్వటం కోసమే పారిమోయొచ్చేసారనుకున్నాను"- సుందరి నవ్వింది.

మళ్లీ ధ్వని... " దీనమ్మకడుపు చల్లగా, "హుఁ" అనుకున్నాడు యోగారావు, " మరి, మరి,

నువ్వింత ఆలస్యంగా వచ్చేవేంటి?'' అన్నాడు

'' నేనా! మీ బిల్లిచ్చేసి అట్నుంచి రెండు మూడు పేరంటాలకెళ్లొచ్చానంతే!''

కంగారుపడ్డాడు '' అయితే నీతో డబ్బు తీసికెళ్ళావన్నమాట. నీ దగ్గర డబ్బుంచుకునే నన్ను కొట్లో తనఖా పెట్టావన్నమాట!'' యోగారావు గొంతులో కసి ధ్వనించింది.

సుందరి తెల్లబోయి చూసింది. తేరుకుని అంది!'' ఆ మొదటికొట్లో చీరె నేను మొన్ననే కొన్నాను నాడబ్బుతో. దానికి మాచ్ అయ్యే జాకెట్టు గుడ్డ ఏరుంచమని చెప్పి ఆ చీరెని ఆ కొట్లోనే అట్టే పెట్టేసాను. తీరా ఇప్పుడు మనం వెళ్తేవాడు మాచింగ్ గుడ్డ దొరకలేదన్నాడు. కనీసం మీరు తొడుకున్న చొక్కా షేడయినా చూడమన్నాను. అదీ లేదన్నాడు. నేనిహ చీరె తీసుకుని పక్కషాపు కెళ్ళాను. నా జాకెట్టు విషయం తేలిన తర్వాత మనిద్దరం కలిసి మీబట్టలు సెలెక్ట్ చేసుకోవచ్చునన్నది నా ఆలోచన కానీ ఈ లోపల మీరే వచ్చి సెలెక్టు చేసుకున్నారు.''

యోగారావు దెబ్బతిన్నాడు; '' ఏంటీ, నీ చీరకి డబ్బు నువ్వు మొన్ననే ఇచ్చేసావా! మరిందాకన రెండొందలు వాడికిచ్చొచ్చానే!'' అన్నాడు. సుందరి కళ్ళు చక్రాల్లాగా తిప్పింది. భుజాలు పైకెగరేసింది చేతులు జోడించింది. ''ప్చ్, కృష్ణార్పణం!'' అంది. యోగారావు చటుక్కున లేచాడు. చెప్పుల్లో కాళ్లు పెట్టుకుంటూ, ''షాపు మూసేస్తాడో ఏంపాడో?'' అన్నాడు. గుమ్మం దిగాడు. వీధిలోకెళ్ళబోయాడు. సుందరి పిలిచింది. ''సార్, సార్ మాట?... మీ డబ్బు నేను వసూలు చేసుకున్నాన్లెండి. అది తీసికెళ్ళే రెండో కొట్లో మీ బట్టల బిల్లు కట్టాను.''

యోగారావు వెనక్కొచ్చాడు. సుందరీ మొహంలోకి చూస్తూ అన్నాడు. '' ఇదే నాకు మంట! అన్నీ ధ్వని పన్లే! నువ్వు చీరెని మొన్ననే కొనేసిన విషయం నాకు చెప్పి వెళ్ళకూడాదా? పోనీ నాడబ్బు నువ్వు తీసుకున్నట్టు ఇప్పుడు చెప్పకూడదా?... రచయిత్రినని వెధవ టెక్కు !''

'' ఆగండాగండి!.. రచయిత్రి భర్తగారుగా సగం గౌరవమూ, సగం టెక్కూ తమకు దక్కుతున్నాయిగా స్వామీ!''... '' ఏంటీ, నిన్ను బట్టి నాకు గౌరవమా! నాకంటూ సొంతం ఏంలేదా?''

సుందరి నవ్వింది. '' అమాట నేనన్నానా?... అసలు మీ పేరూ మీ ఉద్యోగమూ చెప్పుకునే గదా రెండో కొట్లొంచి బయట కొచ్చిందీ, మొదటి కోట్లోకెళ్లి మీరు డబ్బిచ్చిన విషయం తెలుసుకొని ఆ డబ్బు వెనక్కి తీసుకువెళ్లి రెండో కొట్లో చెల్లింపు చేసిందీను!... అయ్యా అసలు మీ జేబులోకొచ్చిన డబ్బు నారచనల ఎకౌంటులోదన్న విషయం ఇప్పటికయినా స్ఫురించిందా ?.. ఏంటో అనాడు అది లేదనుకున్నానూ , ఈనాడు ఇది లేదని తెలుసుకుంటున్నాను, ప్చ్!''

'' అదిగో మళ్లీ ధ్వని!'' - చిరాగ్గా అన్నాడు యోగారావు సుందరి భర్తని కుర్చీలోకి కూలదోసింది. అతని మొహం మీదికి తన బుగ్గని నొక్కి పెట్టి రుద్దింది.

'ప్చ్' - ముద్దుపెట్టక తప్పలేదు యోగారావుకు.

'' అదిగో ధ్వని!.. మీరు చేస్తూ నన్నంటారెందుకు?'' కిలకిలా నవ్వింది సుందరి!

(క్రోక్విల్ హాస్యప్రియ నవంబర్ 85)

*** *** ***